

అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్‌: శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి మేళ తాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు.



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్‌: శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై ఆదివారం గుంటూరుకు చెందిన సుబ్బలక్ష్మి బృందం వారి సంప్రదాయ నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1.633 అడుగులు
ప్రస్తుతం	:1.598
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:21
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:50.715
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:263

న్యూస్‌రీల్‌

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

- జిల్లా కలెక్టర్‌ రాజకుమారి

నంద్యాల: కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్‌ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి అర్జీలను పబ్లిక్‌ గ్రీవెన్స్‌ రెడ్రెస్సల్‌ సిస్టమ్‌ (పీజీఆర్‌ఎస్‌) ద్వారా చేపడుతున్నట్లు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి జిల్లాధికారులందరూ హాజరు కావాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్‌ స్థాయిలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్‌ వివరించారు.

శ్రీగిరికి పోటెత్తిన భక్తులు



మల్లన్న దర్శనానికి బారులుదీరిన భక్తులు

శ్రీశైలంటెంపుల్‌: శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు రోజు కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. వేకువజామునే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. పలువురు భక్తులు మల్లన్నకు గర్భాలయ, సామూహిక అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. సర్వ దర్శనానికి 3 గంటలు, శీఘ్ర దర్శనానికి 2గంటల సమయం పట్టింది. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దేవస్థాన అధికారులు పలు ఏర్పాట్లు చేశారు. ఉచిత కంపార్ట్‌మెంట్లలో వేచిఉన్న భక్తులకు తాగునీరు, అల్పాహారం, బిస్కెట్లు పంపిణీ చేశారు. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది.


వెబ్‌సైట్‌లో ఇసుక సమాచారం

కర్నూలు (టౌన్‌): ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఈనెల 8వ తేదీ నుంచి ఉచిత ఇసుక విధానం అమలవుతోంది. వినియోగదారులు ఇసుక సమాచారం కోసం //mines.ap.gov.in/sand అనే వెబ్‌సైట్‌లో చూసుకోవాలని జిల్లా గనులు, భూగర్భ శాఖ ఉప సంచాలకులు రాజశేఖర్‌ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇసుక స్టాక్‌ పాయింట్‌ ఎక్కడ ఉంది? ఎంత నిల్వ ఉంది? తదితర వివరాలు వెబ్‌సైట్‌లో ఉంటాయని పేర్కొన్నారు.

కరువు కాటకాలతో రైతులు అల్లాడుతున్న రోజులు అవి...భూగర్భ జలాలు తగ్గిపోవడం, సహజ వనరులు క్షీణించిపోవడం, సరైన పంట దిగుబడులు రాకపోవడం.. వెరసి అనేక మంది రైతులు కూలీలుగా మారాల్సిన దుస్థితి.. వ్యవసాయం దండగ అని అప్పటి పాలకులు సెలవివ్వడంతో ఏమీ చేయలేని దౌర్భాగ్యం.. అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో 2004లో ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా డాక్టర్‌ వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించి.. రైతుల జీవితాల్లో వెలుగులు నింపారు. ఉచిత విద్యుత్‌ ఇచ్చి వ్యవసాయాన్ని పండుగ చేశారు. జలయజ్ఞంతో సాగునీటి ప్రాజెక్టులు చేపట్టి బీడుభూములను సస్యశ్యామలం చేశారు. ప్రతి కుటుంబానికి అంతో..ఇంతో స్థిరాస్తి ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వ భూములను సాగు నిమిత్తం పంపిణీ చేసి కూలీలను రైతులుగా మార్చారు. కరువుతో అల్లాడుతున్న ఉమ్మడి కర్నూలు జిల్లాకు ఎంతో మేలు చేశారు. ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. సోమవారం వైఎస్సార్‌ జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం..

కరువు నేలపై రాజ ముద్ర

- వ్యవసాయాన్ని పండుగ చేసిన వైఎస్సార్‌
- ఉచిత విద్యుత్‌తో రైతులకు ఎంతో మేలు
- జలయజ్ఞంతో బీడు భూములు సస్యశ్యామలం
- భూముల పంపిణీతో రైతులుగా మారిన పేదలు
- విరివిగా పండ్లతోటల అభివృద్ధి
- నేడు దివంగత నేత డాక్టర్‌ వైఎస్‌ రాజశేఖర్‌ రెడ్డి జయంతి





అవుకు రిజర్వాయర్‌



వైఎస్సార్‌ హయాంలో అభివృద్ధి చెందిన పండ్లతోట

కర్నూలు(అగ్రికల్చర్‌): దివంగత నేత డాక్టర్‌ వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి పాలన నేటికీ ఆదర్శమే. పాలన అంటే ఎలా ఉండాలో మహానేత చూపించారు. వైఎస్సార్‌ అమలు చేసిన పథకాలను రద్దు చేసేందుకు ఏ ప్రభుత్వం సాహసించ లేదంటే అతిశయోక్తి కాదు. ఆరోగ్య శ్రీ, ఉచిత విద్యుత్‌ విద్యుత్‌, జలయజ్ఞం, ఫీజురీయింబర్స్‌మెంటు ఇలా అనేక పథకాలు బహుళ ప్రజాదారణ పొందాయి. కొత్తగా వచ్చిన ప్రభుత్వాలు వాటికి పేర్లు మార్చుకొని అమలు చేస్తున్నాయి. ఆరోగ్య శ్రీ అమలులోకి రాకముందు గుండెజబ్బులు, క్యాన్సర్‌ వంటి వ్యాధులు సంభవిస్తే ప్రాణాలపై ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితి. వైఎస్సార్‌ ఆరోగ్య శ్రీ పథకం అమలు చేసిన తర్వాత పేదింటి ప్రాణాలకు గ్యారంటీ ఏర్పడింది. గుండెపోటువంటి సంఘటనలు చోటు చేసుకున్నా.. కార్పొరేట్‌ ఆసుపత్రుల్లో ఉచితంగా చికిత్స పొందే అవకాశం అందుబాటులోకి వచ్చింది. ప్రతి ప్రభుత్వం ఈ పథకాన్ని విధిగా అమలు చేస్తోంది.

రైతుల పాలిట వరం ఉచిత విద్యుత్‌...

ఉచిత విద్యుత్‌ రైతుల పాలిట వరంగా మారింది. 2004 ముందు రైతుల పరిస్థితి దయనీయంగా ఉండేది. అప్పట్లోనే వ్యవసాయ విద్యుత్‌ రైతులకు పెనుభారంగా మారేది. వ్యవసాయం సంక్షోభంలో పడిన సందర్భంలో ఉచిత విద్యుత్‌ ఇవ్వడం కష్టాల్లో కూరుకపోయిన రైతులకు ఊపిరి పోసింది. 2009 నాటికి ఉమ్మడి జిల్లాలో 1.50 లక్షల వ్యవసాయ విద్యుత్‌ కనెక్షన్లు ఉండగా 2019 నాటికి 1.64 లక్షలు.. నేడు 2.23 లక్షలకు చేరాయి. వైఎస్‌ఆర్‌ వ్యవసాయానికి విజయవంతంగా 7 గంటలు ఉచిత విద్యుత్‌ ఇవ్వగా... ఆయన తనయుడు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పగటి పూటనే 9 గంటల ఉచిత విద్యుత్‌ ఇచ్చారు. వైఎస్సార్‌ను రైతు బాంధవుడిగా గుర్తింపు పొందడంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆయన జయంతిని రైతుదినోత్సవంగా ఐదేళ్లు నిర్వహించింది. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌ జయంతిని విస్మరించడం గమనార్హం.

కూలీలు రైతులయ్యారు....

వైఎస్సార్‌ అమలు చేసిన భూపంపిణీ కార్యక్రమంతో కూలీలు రైతులయ్యారు. వైఎస్సార్‌ హయాంలో ఉమ్మడి జిల్లాలో దాదాపు 1.20 లక్షల మంది రైతులకు 1.35 లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేశారు. పేదలకు పంపిణీ చేసిన అసైన్డ్‌ భూముల్లో ఉపాధి హామీ పథకం కింద డ్రైల్యాండ్‌ హార్టికల్చర్‌ పేరుతో పండ్లతోటల పెంపకాన్ని చేపట్టి వారికి శాశ్వత ఆదాయ వనరులను సృష్టించారు. 2007లో అమలులోకి వచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2007–08, 2008–09సంవత్సరాల్లో డ్రైల్యాండ్‌ హార్టికల్చర్‌ కింద దాదాపు 8000 ఎకరాల్లో పండ్లతోటలు అభివృద్ధి చేశారు.

తండ్రిబాటలో తనయుడు

ఉచిత విద్యుత్‌, జలయజ్ఞం, రైతులకు పావలా వడ్డీకే పంట రుణాలు వంటి పథకాలతో వ్యవసాయాన్ని వైఎస్సార్‌ పండుగ చేశారు. ఆయన తనయుడు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి 2019–20 నుంచి 2023–24 వరకు ఐదేళ్లు రైతుల సంక్షేమానికి పెద్దపీట చేశారు. వైఎస్‌ఆర్‌ రైతుభరోసా, వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌, రైతులకు సున్నా వడ్డీ పంట రుణాలు, ఉచిత పంటల బీమా, అతివృష్టి, అనావృష్టి వల్ల పంటలు దెబ్బతింటే అదే సీజన్‌లోనే ఇన్‌పుట్‌ సబ్సిడీ చెల్లించడం, గ్రామస్థాయిలోనే రైతులకు అన్ని రకాల సేవలు అందించే ఏర్పాటు చేశారు. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం.. రైతులకు ఇచ్చిన హామీలపై దృష్టి సారించడం లేదు. ఉన్న పథకాలను ఎత్తివేసే దిశలో ఆలోచిస్తోంది.

రైతుల కల్పతరువు 'అవుకు'

కోవెలకుంట్ల: మహానేత డాక్టర్‌ వైఎస్‌ రాజశేఖర్‌ రెడ్డి జలయజ్ఞంలో భాగంగా అవుకు రిజర్వాయర్‌ రిజర్వాయర్‌ సామర్థ్యాన్ని రెండు టీఎంసీల నుంచి నాలుగు టీఎంసీలకు పెంచారు. అలాగే గాలేరు–నగరి కాలువను తవ్వించారు. ఈ కాల్వ నుంచి వైఎస్సార్‌, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో 2.67లక్షల ఎకరాలకు సాగునీరు, 640 గ్రామాల్లో 20 లక్షల మందికి తాగునీరు అందించాలన్నది లక్ష్యం. శ్రీశైలం జలాశయం నుంచి అవుకు రిజర్వాయర్‌లోకి నీరు చేరేందుకు రెండు సొరంగమార్గాలను ఏర్పాటు చేశారు. ఒక సొరంగం నుంచి 2010 నాటికే వైఎస్సార్‌ జిల్లా గండికోటకు నీటిని విడుదల చేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో రెండు సొరంగాల ద్వారా పదివేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అంతేకాకుండా ముందుచూపుతో మూడో టన్నెల్‌ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రూ. 300 కోట్లతో 5.9 కిమీ పొడవున నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. వైఎస్సార్‌ చలువతో అవుకు రిజర్వాయర్‌ రాయలసీమ జిల్లాలకు కల్పతరువుగా మారింది.

అంతా వైఎస్సార్‌ చలువే



నేను 2004కు ముందు నిరుపేదను. కూలీ పనులకు వెళుతూ బతికేవాన్ని. వైఎస్సార్‌ చలువతో భూ పంపిణీలో నాకు 2.50 ఎకరాలు ఇచ్చారు. అప్పట్లో రాళ్లు, రప్పలు, చెట్లతో అడవిలాగా ఉన్న ఈ భూమిని 2007లో ఉపాధి నిధులతో చీనీ తోట అభివృద్ధి చేసుకున్నా. ప్రభుత్వం సబ్సిడీతో సూక్ష్మ సేద్య సదుపాయం కల్పించింది. ఏటా ఖర్చులు పోను రూ.2 లక్షలకు పైగా ఆదాయంవస్తోంది. ఇదంతా వైఎస్సార్‌ చలువే.

– వైదీ తిమ్మన్న, కొమరోలు, ఓర్వకల్లు మండలం

ప్రశాంతంగా బతుకుతున్నాం



వైఎస్సార్‌ హయాంలో అమలు చేసిన డ్రైల్యాండ్‌ హార్టికల్చర్‌ మమ్మల్ని ఎంతో ఆదుకుంది. నేను నాలుగు ఎకరాల్లో చీనీ మొక్కలు నాటుకున్నా. అప్పట్లో వర్షాలు బాగా పడటంతో మొక్కలు బాగా పెరిగాయి. నాటిన ఐదేళ్ల నుంచి పంట రావడం మొదలైంది. మొదటి రెండేళ్లు పంట అంతగా లేకపోయినప్పటికీ తర్వాత ఏడాదికేడాదికి దిగుబడి పెరుగుతూ వచ్చింది. వైఎస్సార్‌ చలువతో మా గ్రామంలో పండ్లతోటలు అభివృద్ధి చెంది ప్రశాంతంగా బతుకుతున్నాం.

– మద్దిలేటి, కొమరోలు, ఓర్వకల్లు మండలం

ప్రజల హృదయాల్లో నిలిచిపోయారు



ఉచిత విద్యుత్‌, ఆరోగ్య శ్రీ, జలయజ్ఞం, భూ పంపిణీ వంటి పథకాలు అమలు చేసి మహానేత వైఎస్సార్‌ ప్రజల హృదయాల్లో నిలిచిపోయారు. వైఎస్సార్‌ చేపట్టిన కార్యక్రమాలు నేటికీ యథాతథంగా అమలవుతున్నాయి. ఆయన తనయుడు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి బాటలోనే పయనిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ పాలనా కాలంలో రైతుల అభ్యున్నతికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు.

– బిల్లం మహేశ్వరరెడ్డి, మాజీ చైర్మన్‌, జిల్లా వ్యవసాయ సలహా మండలి

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి

- జిల్లా నూతన కలెక్టర్‌ రాజకుమారి



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్‌ రాజకుమారి



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

నంద్యాల: ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, మీడియా అందరినీ సమన్వయం చేసుకొని జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా నూతన కలెక్టర్‌ రాజకుమారి గణియా అన్నారు. ఆదివారం ఉదయం 11.35 గంటలకు కలెక్టర్‌ చాంబర్‌లో వేదపండితుల ఆశీర్వచనాలు, సర్వమత ప్రార్థనల అనంతరం కలెక్టర్‌గా ఆమె బాధ్యతలు స్వీకరించారు. జాయింట్‌ కలెక్టర్‌ రాహుల్‌ కుమార్‌ రెడ్డి, ఎస్పీ రఘువీర్‌రెడ్డి, ఏఎస్పీ ప్రవీణ్‌కుమార్‌, డీఆర్‌ఓ పద్మజ, ఆర్డీఓలు, జిల్లా అధికారులు, సిబ్బంది జిల్లా కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి బొకేలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌ రాజకుమారి మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానన్నారు. కలెక్టర్‌గా పదోన్నతి పొందిన తర్వాత మొదటి సారి నంద్యాల లాంటి మంచి జిల్లాలో పని చేసే అవకాశం రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ, అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తామన్నారు. అన్ని శాఖలను సమన్వయం చేసుకొని ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలను క్షేత్రస్థాయిలోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లా స్వరూపం, వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలు, ఇరిగేషన్‌, పరిశ్రమలు, టూరిజం తదితర అన్ని సెక్టార్లలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులను ఆకళింపు చేసుకుంటానన్నారు. అనంతరం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించి ఆ మేరకు చర్యలు తీసుకుంటానన్నారు. అనంతరం కలెక్టర్‌ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్‌ హాల్‌, కమాండ్‌ కంట్రోల్‌ రూమ్‌, అన్ని సెక్షన్ల విభాగాలను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

క్లస్టర్‌ యూనివర్సిటీపై తప్పుడు కథనాలు

- కనీస అవగాహన లేకుండా కొన్ని పత్రికలు అసత్య వార్తలు రాశాయి
- సిల్వర్‌జూబ్లీ, క్లస్టర్‌ యూనివర్సిటీ అభివృద్ధి కోసమే శ్రమించాం
- తప్పుడు వార్తలపై పరువునష్టం దావా వేస్తాం
- రాష్ట్ర మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి

కర్నూలు సిటీ: క్లస్టర్‌ యూనివర్సిటీ, సిల్వర్‌ జూబ్లీ కళాశాలపై కొన్ని పత్రికలు కనీస అవగాహన లేకుండా తప్పుడు కథనాలు ప్రచురించాయని, వాటిపై కోర్టులో పరువు నష్టం దావా దాఖలు చేస్తామని రాష్ట్ర మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. స్వాతంత్య్రం వచ్చిన 25 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో నిర్మించిన ప్రతిష్టాత్మక కాలేజీ కావడంతో 'సిల్వర్‌జూబ్లీ' అని పేరు పెట్టారన్నారు. అందులో మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐవీఆర్‌ కృష్ణారావు, మాజీ డీజీపీ ఘట్టమనేని శ్రీనివాస్‌ లాంటి ఎంతోమంది చదువుకున్నారన్నారు. ఎవ్వరూ దాని అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. తాను చదవాలని, చదవలేకపోయిన సిల్వర్‌జూబ్లీ ఎలా ఉందో చూద్దాం అని, 2019లో తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత వెళ్లానన్నారు. విద్యార్థులకు మరుగుదొడ్లు కూడా లేకుండా ముళ్లపొదల్లోకి వెళ్లడం చూసి బాధేసిందన్నారు. వెంటనే మరుగుదొడ్లు ఇతర మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాలని చెబితే రూ.22కోట్లతో ప్రతిపాదనలు పంపారన్నారు. అయితే భవనాలు రోడ్డు కంటే తగ్గులో ఉండటంతో నీరు నిల్వ చేరుతోందని కొత్త భవనాలు నిర్మిద్దామని చెబితే తిరిగి రూ.88కోట్లతో కొత్త ప్రతిపాదనలు పంపారన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వ 'రూసా' నిధులతో సిల్వర్‌జూబ్లీలో రోడ్డు పక్కన మొత్తం భవనాలు నిర్మించారన్నారు. ట్రాఫిక్‌, వాహనాల సౌండ్‌తో విద్యార్థులకు ఇబ్బంది ఉంటుందనే కారణంతో క్లస్టర్‌ యూనివర్సిటీని జగన్నాథగట్టుపై నిర్మించేందుకు ప్రతిపాదించామన్నారు. అక్కడ రాక్‌కటింగ్‌తో పాటు బాలకల వసతి గృహాలు ఇతర నిర్మాణాల కోసం తిరిగి రూ.130కోట్లతో ప్రతిపాదనలు పంపారన్నారు. అయిత జిల్లా విద్యార్థుల కోసం క్లస్టర్‌ యూనివర్సిటీ అద్భుతంగా ఉండాలని ఆ నిధులను కూడా మంజూరు చేశామన్నారు. ప్రపంచ శ్రేణి ఆర్కిటెక్చర్‌తో ఈ భవనాలు నిర్మించేందుకు డిజైన్‌లు రూపొందించామన్నారు. రూసా నిధులతో నిర్మించే భవనాలు, రాష్ట్ర ప్రభుత్వం నిధులతో నిర్మించే భవనాలు రెండు వేర్వేరు అని ఈ అవగాహన కూడా కొన్ని పత్రికలకు లేదని బుగ్గన అన్నారు.

ఫోర్జరీ సంతకాలకు తనకేం సంబంధం

వర్సిటీ బిల్లుల విషయంలో బిల్లుల కోసం రిజిస్ట్రార్‌ సంతకం ఫోర్జరీ చేశారని ఆరోపించారని, నిజంగా ఫోర్జరీ చేస్తే ఫోరెన్సిక్‌, పోలీసులకు ఫిర్యాదు చేయాలి, కానీ తనకే ఏం సంబంధం ఉంటుందని బుగ్గన ప్రశ్నించారు. అలాగే ఒత్తిడి తెచ్చి జీతాలు ఇవ్వకుండా ఆపారని ఆరోపించారని, ట్రెజరీకి ఫోన్‌ చేసి బిల్లులు ఆపాలని ఓ ఆర్థికశాఖ మంత్రిగా తానెందుకు చెబుతానన్నారు. తాను లిఖిత పూర్వకంగా లేదా మౌఖికంగా ఎవ్వరికైనా చెప్పినట్లు ఆధారాలున్నాయా? అని ప్రశ్నించారు. తప్పుడు రాతలపై కోర్టుకు వెళ్లి పరువునష్టం దాఖలు చేస్తామని బుగ్గన అన్నారు. అలాగే రాష్ట్రంలో అన్ని హాస్టళ్లకు రూపాయి కిలో బియ్యం ఇస్తున్నారని, కానీ సిల్వర్‌జూబ్లీ కాలేజీ వారు మార్కెట్‌ ధరకు బయట కొనుగోలు చేసేవారు. దీంతో ఇక్కడ కూడా రూపాయి బియ్యం ఇచ్చేలా ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు ఇచ్చామన్నారు. ఇలా ప్రతీ అంశంలో కాలేజీకి మంచి చేయాలనే సంకల్పించామన్నారు. విషయాలు తెలుసుకోకుండా తప్పుడు వార్తలు రాయడం మంచిది కాదన్నారు.

క్లుప్తంగా

ఆగస్టు 16 నుంచి వీహెచ్‌పీ షష్ట్యబ్ది ఉత్సవాలు



మాట్లాడుతున్న గోరంట్ల రమణ

కర్నూలు కల్చరల్: విశ్వ హిందూ పరిషత్ షష్ట్యబ్ది ఉత్సవాలు ఆగస్టు 16 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించాలని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ పేర్కొన్నారు. ఆదివారం రెవెన్యూ కాలనీలోని భరత మాత మందిర ప్రాంగణంలో జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షష్టిపూర్తి సందర్భంగా ప్రతి ప్రఖండలో హిందూ ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించాలన్నారు. రాజకీయాలతో సంబంధం లేని ప్రముఖులను ప్రఖండ సమావేశాలకు ఆహ్వానించాలన్నారు. జిల్లా పరిధిలోని 12 ప్రఖండలలో ఘనంగా వేడుకలు నిర్వహించాలన్నారు. వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి భాను ప్రకాష్, నగర అధ్యక్షులు టీసీ మద్దిలేటి, రాష్ట్ర కోశాధికారి సందడి మహేష్, విభాగ్ ధర్మ ప్రసార్ విజయుడు, జిల్లా సహ కార్యదర్శులు గిరిబాబు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కొలతల స్వీకరణ



శిబిరానికి హాజరైన దివ్యాంగులు

కర్నూలు కల్చరల్: భారత్ వికాస్ పరిషత్, కర్నూలు తుంగ భద్ర, హంద్రీ శాఖల ఆధ్వర్యంలో ఉచితంగా కృత్రిమ అవయవాలు అందజేసేందుకు ఆదివారం కొలతల శిబిరం నిర్వహించారు. బుధవార పేట కేశవ మెమోరియల్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో 95 మంది దివ్యాంగులకు అవసరమైన అవయవాలకు సంబంధించిన కొలతలను తీసుకున్నారు. ఈ సందర్భంగా బీవీపీ కన్వీనర్ రేగూడు బాలకృష్ణ మాట్లాడుతూ భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో గత పది సంవత్సరాల నుంచి దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందజేస్తున్నామన్నారు. అందులో భాగంగా ఈ ఏడాది 95 మందికి ఆగస్టు రెండో వారంలో అవయవాలను అందజేస్తామన్నారు. అధ్యక్షులు అనుమలు లక్ష్మణ స్వామి, కార్యదర్శి బుస్సా శ్రీనివాసులు, బాల సుబ్రహ్మణ్యం, కోదండరామయ్య, మురళీకృష్ణ, బయ్యావాసు, ఆనంద గురూజీ పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ఇవ్వాలి

- ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి



మాట్లాడుతున్న గోకారి

కర్నూలు సిటీ: రాష్ట్రంలో ఏర్పాటైన కొత్త ప్రభుత్వం ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి కోరారు. ఆదివారం స్థానిక సలాంఖాన్ భవనంలో ఏర్పాటు చేసిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా, ఉపాధ్యాయ రంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియంతో పాటు తెలుగు మీడియంను సమాంతరంగా అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులను తప్పించి ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా పని భారాన్ని తగ్గించాలన్నారు. పురపాలక ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు వెంటనే చేపట్టాలన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ప్లస్ టూ పాఠశాలల్లో రెగ్యులర్ ప్రాతిపాదికన పదోన్నతులు చేపట్టాలని, 98, 2008 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్లను రెగ్యులర్ ప్రాతిపాదికన నియమించాలన్నారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు సుధీర్, దేవదాసు, శివనాగిరెడ్డి, శేఖర్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

రోగుల్లా వస్తారు.. దోచేస్తారు

- పెద్దాసుపత్రిలో పెట్రేగుతున్న దొంగలు
- కన్నుమూసి తెరిచేలోగా చోరీ
- పిక్ ప్యాకెట్ నుంచి బైక్ చోరీల వరకు
- మగవాళ్లు బురఖాలు ధరించి చేతివాటం
- చోద్యం చూస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

ఓర్వకల్లు మండలానికి చెందిన లక్ష్మీదేవి ఆరోగ్యం బాగోలేకపోతే చికిత్స చేయించుకోవడానికి రెండు రోజుల క్రితం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వచ్చింది. వైద్యులు ఆమెను పరీక్షించి అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేయించుకోవాలని సూచించారు. స్కానింగ్ చేయించుకుని రిపోర్టు కోసమని క్యూలో నిలబడింది. అదే సమయంలో ఆమె చేతి సంచిలోని రెండు పర్సులను దొంగలు కొట్టేసి, వాటిలోని 17,050ను కాజేశారు.

గార్గేయపురానికి చెందిన వెంకటేశ్వర్లుకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఓపీ టికెట్ తీసుకుని గత శనివారం న్యూరోసర్జరి ఓపీ వద్ద చికిత్స చేయించుకుంటున్నాడు. అతని వెంట ఉన్న భార్య ఓబులమ్మ బ్యాగులో ఉన్న సంచిని బ్లేడుతో కోసేసి అందులోని సెల్‌ఫోన్‌తో పాటు రూ.6వేలను దొంగలు చోరీ చేశారు. విషయాన్ని ఆసుపత్రిలోని అధికారులకు, సెక్యూరిటీ గార్డులకు చెప్పుకున్నా వినేవారు కరువయ్యారు.



కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ప్రతిరోజూ ఎక్కడో రెండు, మూడు చోట్ల చోరీలు జరుగుతూనే ఉన్నాయి. వందలాదిగా సెక్యూరిటీ గార్డులు విధులు నిర్వహిస్తున్నా దొంగలు మాత్రం యథేచ్ఛగా ఆసుపత్రిలో తిరుగుతూ అందిన కాడికి దోచుకెళ్తున్నారు. కొందరు పిక్ ప్యాకెట్లపై ఆధారపడుతుండగా, మరికొందరు పాత సామాను, ఇంకొందరు వైద్యపరికరాలను తస్కరిస్తున్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఎంతో సువిశాలమైనది. అటు కేసీ కెనాల్ నుంచి ఇటు హంద్రీ నది వరకు ఇది విస్తరించి ఉంది. అటు ఇటూ కలిపి దాదాపు 200 ఎకరాల దాకా ఈ బోధనాసుపత్రి విస్తీర్ణం ఉంది. కేవలం ఆసుపత్రి మాత్రమే వంద ఎకరాల్లో ఏర్పాటై ఉంది. 40 విభాగాల దాకా ఉన్న ఈ ఆసుపత్రికి ప్రతిరోజూ 2,500ల నుంచి 3వేల దాకా ఓపీ రోగులు, 1200 నుంచి 1500ల వరకు ఇన్‌పేషంట్లు చికిత్స పొందుతూ ఉంటారు. వీరి వెంట ఇద్దరు, ముగ్గురు సహాయకులు ఉంటారు. వీరికి వైద్యసేవలు అందించేందుకు గాను వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది, నర్సులు, నాల్గవ తరగతి ఉద్యోగులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కలిపి మొత్తం 2వేల మంది దాకా ఉంటారు. ఇలా మొత్తం ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దాదాపు పదివేల మంది వైద్యం కోసం అటు ఇటూ తిరుగుతూ ఉంటారు. ఇంత రద్దీగా ఉండే ఈ ప్రాంతం దొంగలకు ఆవాసంగా మారింది. రోగులు, వారి సహాయకుల ముసుగులో నిత్యం వారు ఆసుపత్రిలో తిరుగుతూ అందిన కాడికి దోచుకెళ్తున్నారు.



రద్దీ ప్రాంతాల్లో మాటేసి..

ఆసుపత్రిలో ప్రతిరోజూ ఓపీ టికెట్ కౌంటర్లు, మెడికల్‌షాపులు, డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో రక్తపరీక్షలు, సీటీస్కాన్, ఎంఆర్‌ఐ, అల్ట్రాసౌండ్ స్కాన్, ఎక్స్‌రే తీసే కేంద్రాలతో పాటు మెడికల్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, పీడియాట్రిక్, ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, కార్డియాలజీ, నెఫ్రాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ తదితర ఓపీ విభాగాల వద్ద, క్యాజువాలిటీలో రోగుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. రద్దీ ప్రాంతాలను దృష్టిలో ఉంచుకుని పిక్‌ప్యాకెటర్లు చెలరేగిపోతున్నారు. రోగులు, వారి సహాయకుల ముసుగులో వచ్చి చేతి సంచులు, బ్యాగ్‌లను బ్లేడ్లతో కోసి అందులోని సెల్‌ఫోన్లు, డబ్బును తస్కరిస్తున్నారు. కొందరు ఆడవాళ్లే బురఖాలు ధరించి వస్తుండగా, మరికొందరు మగవాళ్లు కూడా బురఖాలు వేసుకుని వచ్చి చోరీలకు పాల్పడుతున్నారు. ఈ మేరకు ప్రతిరోజూ ఈ రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఒకరిద్దరు తప్పనిసరిగా చోరీకి గురవుతున్నారు.

సెక్యూరిటీ గార్డులున్నా....

ఆసుపత్రిలో రోగుల రద్దీని నియంత్రించేందుకు, ఆసుపత్రితో పాటు వైద్యపరికరాలు, రోగుల భద్రతకు గాను ప్రైవేటు సెక్యూరిటీని ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించి ఆసుపత్రిలో 200 మందికి పైగా సెక్యూరిటీ గార్డులు పనిచేస్తున్నారు. వీరందరూ ఆయా విభాగాల వద్ద కావలాగా ఉంటూ విధులు నిర్వహించాల్సి ఉంది. వీరు కావలాగా ఉన్న చోట కూడా దొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. వారి ఎదురుగానే రోగులు, వారి సహాయకుల మాదిరిగా వచ్చి తమ పని కానిచ్చేస్తున్నారు.

అందుబాటులోకి రాని సీసీ కెమెరాలు

ఆసుపత్రిలో గత కొన్ని సంవత్సరాలుగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తూనే ఉన్నారు. వాటిని ఏర్పాటు చేసిన ప్రతిసారీ వాటికి రంగు వేయడం లేదా వైర్లు కట్ చేయడం, అవి పనిచేయకుండా చేయడం పరిపాటిగా మారింది. ఈ క్రమంలో గత పదేళ్ల కాలంలో ఆసుపత్రిలో ఇప్పటికే నాలుగైదు సార్లు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఉంటారు. ఇప్పుడు మరోసారి దాదాపు 300ల దాకా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా వీటిని ఏర్పాటు చేసినా ఇంకా కొన్ని అందుబాటులోకి రాలేదు. దీంతో ఆసుపత్రిలో ఎక్కడ ఏమి జరిగినా గుర్తించలేని పరిస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి త్వరగా సీసీ కెమెరాల వ్యవస్థను ప్రారంభించాల్సి ఉంది. అలాగే చోరీల నియంత్రణకు అవసరమైన చర్యలను తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

రాత్రివేళ వార్డుల్లో...

ఆసుపత్రిలో అర్ధరాత్రి దాటిన తర్వాత దాదాపు అందరూ గాఢనిద్రలో ఉంటారు. ముఖ్యంగా రాత్రి 2 గంటల తర్వాత అందరూ నిద్రపోతుంటారు. ఇదే సమయంలో దొంగలు వార్డుల్లో కలియదిరుగుతూ బ్యాగులు, సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్నారు. ఇదే సమయంలో డ్యూటీలో ఉన్న వైద్య విద్యార్థులు, నర్సుల సెల్‌ఫోన్లు, బ్యాగులు, ల్యాప్‌టాప్‌లు దొంగతనం చేస్తున్నారు. ఇటీవల క్యాజువాలిటీలో ఓ వైద్య విద్యార్థి ల్యాప్‌టాప్‌ను ఓ వ్యక్తి పట్టుకెళ్లాడు. సీసీ కెమెరాలో దీనిని గమనించి దొంగను పట్టుకొచ్చి ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నారు.

వైద్యపరికరాలు, కుళాయిలు కూడా...

ఆసుపత్రిలో కనిపించిన ప్రతి వస్తువులూ దొంగలు పట్టుకెళ్లిపోతున్నారు. వార్డుల్లోని బాత్‌రూమ్‌లలో ఏర్పాటు చేసిన కుళాయిలను ఎప్పటికప్పుడు కోసుకుని వెళ్తున్నారు. రోగుల సహాయకుల కోసం బెడ్ పక్కన స్టూల్ లాంటి కుర్చీలు ఏర్పాటు చేసినా అవి కూడా కనిపించకుండా పోతున్నాయి. అలాగే పలు చోట్ల ఆక్సిజన్ పైప్‌లైన్లు, ఏసీ పరికరానికి ఏర్పాటు చేసిన కాపర్ వైర్‌లను సైతం కోసుకుని వెళ్తున్నారు. మధ్యాహ్నం తర్వాత, రాత్రి వేళల్లో వార్డుల్లో కలియదిరుగుతూ ఏ వస్తువు కనిపించినా దానిని గుట్టుచప్పుడు గాకుండా మాయం చేస్తున్నారు.

కొట్టుకున్న టీడీపీ నాయకులు

- ఐరన్‌ఓర్ వ్యాపారంలో గొడవ

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండలం రామళ్లకోట గ్రామంలో టీడీపీ నాయకుల మధ్య కొట్లాట జరిగింది. ఇటీవల గ్రామ పరిధిలో ఉన్న ఐరన్‌ఓర్ వ్యాపారం తామే చేసుకోవాలన్న పట్టింపుతో పదుల సంఖ్యలో ఒకరిపై ఒకరు దాడులకు పూనుకున్నారు. శనివారం రాత్రి టీడీపీకి చెందిన వెంకటేశ్వర్లు ఇంటిపైకి తిరుమలేశ్, శ్రీను తదితరులు వెళ్లి దాడి చేసే క్రమంలో ఎదురుదాడిలో తిరుమలేశ్, మరికొందరు గాయపడ్డారు. తిరిగి తిరుమలేశ్ వర్గం ఆదివారం ఉదయం వెంకటేశ్వర్లు వర్గం ఇంటిపైకే వెళ్లి దాడి చేయడంతో వెంకటేశ్వర్లు మరి కొందరు గాయపడ్డారు. గాయపడ్డవారు కర్నూలు, వెల్దుర్తి ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సునీల్‌కుమార్ గ్రామానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. తిరుమలేశ్, వెంకటేశ్వర్లు విడివిడిగా ఇచ్చిన ఫిర్యాదుల మేరకు పూర్తిస్థాయి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించాలి



మాట్లాడుతున్న డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరె కృష్ణ

కర్నూలు సిటీ: గత 20 సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కరె కృష్ణ, జిల్లా అధ్యక్షులు వెంకట్రాముడులు కోరారు. ఆదివారం స్థానిక డీటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించి ఉపాధ్యాయులకు జూనియర్ లెక్చరర్స్, డైట్ లెక్చరర్స్, డిప్యూటీ డీఈఓలుగా పదోన్నతులు కల్పించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. తల్లికి వందనం పేరుతో అమలు చేస్తామని చెప్పిన పథకాన్ని కేవలం ప్రభుత్వ స్కూళ్లకు మాత్రమే పరిమితం చేయాలన్నారు. హైస్కూళ్లలో విలీనం చేసిన 3,4,5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలల్లోకి మార్పు చేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు క్యాష్‌లెస్ హెల్త్‌కార్డులను అమలు చేసి ఉచిత చికిత్సను అందించాలన్నారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు వీరన్న, పాటిల్ ఈశ్వర్ రెడ్డి, వెంకటేశప్ప, చంద్రశేఖర్, చిన్న వీరేష్, వెంకటాచలం, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



మృతి చెందిన ధీరజ్ రెడ్డి (ఫైల్)

ప్యాపిలి: పట్టణ సమీపంలోని స్థానిక జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు వెంకటేశ్వర్ రెడ్డి, మల్లిక దంపతుల కుమారుడైన పోతిరెడ్డి ధీరజ్ రెడ్డి (23) తెల్లవారుజామున తన మిత్రుడు రమేశ్‌తో కలసి టీ తాగేందుకు ద్విచక్రవాహనంపై వెళ్లాడు. టీ తాగిన అనంతరం ఎర్రగుంట్లపల్లికి వెళ్తుండగా ముందు వెళ్తున్న కారు డ్రైవర్ సిగ్నల్స్ ఇవ్వకుండా సడన్ బ్రేకు వేశాడు. దీంతో కారు వెనుకనే వస్తున్న బైక్ ప్రమాదవశాత్తూ కారును బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ధీరజ్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా రమేశ్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్యాపిలి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. రోడ్డు ప్రమాదంలో ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందటంతో వెంకటేశ్వర్ రెడ్డి కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. విషయం తెలియగానే మండలానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ధీరజ్ రెడ్డి మృతదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించి సానుభూతి వ్యక్తం చేశారు.

రూ.1.76 కోట్ల అమ్మకాలు నిలిపివేత

- ఎరువులు, విత్తన దుకాణాల్లో కొనసాగుతున్న తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న వ్యవసాయ, విజిలెన్స్ అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): ఎరువులు, విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో వ్యవసాయ, విజిలెన్స్ అధికారులు తనిఖీలు కొనసాగుతున్నాయి. వేర్వేరు జిల్లాల నుంచి వచ్చిన ప్రత్యేక బృందాలు మూడు రోజుల్లో 14 మండలాల్లో తనిఖీలు చేపట్టాయి. మొత్తంగా రూ.1.76 కోట్ల విలువ కలిగిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల అమ్మకాలను నిలిపి వేశారు. కృష్ణా జిల్లా గన్నవరం ఏడీఏ శ్రీనివాసరావు, విజిలెన్స్ సీఐ రామకృష్ణ, పల్నాడు జిల్లా క్రోసూరు ఏడీఏ హనుమంతురావు, విజిలెన్స్ డీఈ చంద్రశేఖర్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. తనిఖీల్లో ఆయా సబ్ డివిజన్ల ఏడీఏలు, మండల వ్యవసాయ అధికారులు పాల్గొంటున్నారు. మూడవ రోజు నాలుగు మండలాల్లో తనిఖీలు జరిగాయి. ఒక టీమ్ మంత్రాలయం, ఎమ్మిగనూరు, మరో బృందం దేవనకొండ, పత్తికొండ మండలాల్లో తనిఖీలు నిర్వహించాయి. మూడో రోజు తనిఖీల్లో భాగంగా రూ.13.35 లక్షల విలువ కలిగిన 5.1 క్వింటాళ్ల విత్తనాలు, రూ.18.7 లక్షల విలువ కలిగిన 138.7 మెట్రిక్ టన్నుల ఎరువులు, రూ.59,306 విలువ కలిగిన 355.5 లీటర్ల పురుగు మందుల అమ్మకాలను నిలిపివేశారు. రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడం, రైతులకు తగిన బిల్లులు ఇవ్వకపోవడం, నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు సాగిస్తుండటం తదితర కారణాలతో అమ్మకాలు నిలిపివేసినట్లు తెలుస్తోంది. మూడు రోజుల్లో మొత్తంగా రూ.1.16 కోట్ల విలువ చేసే విత్తనాలు, రూ.49.22 లక్షల విలువ చేసే ఎరువులు, రూ.98,924 విలువ చేసే పురుగుమందులపై స్టాప్‌సేల్ ఇచ్చారు. మరో రెండు, మూడు రోజులు తనిఖీలు జరిగే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.

మందు బాబుల వీరంగం



బండలను ధ్వంసం చేసిన దృశ్యం



ఇంటి ఆవరణలో పడేసిన మద్యం బాటిళ్లు

కొలిమిగుండ్ల: చింతలాయిపల్లెలో మందు బాబులు శనివారం రాత్రి వీరంగం సృష్టించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్త మధుకు చెందిన హెయిర్‌స్టైల్ దుకాణం ముందు బండరాళ్లతో ఏర్పాటు చేసిన అరుగులను ధ్వంసం చేశారు. దుకాణానికి నిప్పు పెట్టేందుకు ప్రయత్నించగా శబ్దం రావడంతో చుట్టు పక్కల నివాసాల ప్రజలు లైట్లు వేసి బయటకు రావడంతో అక్కడి నుంచి పారిపోయారు. అలాగే మరో వైఎస్సార్‌సీపీ కార్యకర్త సురేంద్ర ఇంటి వరండాలో తాగేసిన మద్యం బాటిళ్లను ఇష్టానుసారంగా పగులకొట్టారు. శబ్దం రావడంతో కుటుంబ సభ్యులు తలుపులు తీసి బయటకు వచ్చే లోగా ఆకతాయిలు అక్కడి నుంచి వెళ్లిపోయారు. గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలే రెండు ఈ ఘటనలకు పాల్పడి ఉంటారని వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చిన్న సినిమాలకు ప్రభుత్వం సబ్సిడీ పెంచాలి



సినీ నటుడు సుమన్

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం చిన్న సినిమాలకు సబ్సిడీ మరింత పెంచాలని సినీ నటుడు సుమన్ అన్నారు. పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలో ఆదివారం ఎద్దుల కాటన్ ప్రయివేట్ లిమిటెడ్ దుస్తుల దుకాణాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల పెద్ద ఎత్తున సినిమా థియేటర్లు మూతబడటం వాస్తవమేనన్నారు. చిన్న సినిమాలతో ఎందరో కళాకారులకు భవిష్యత్ లభిస్తుందన్నారు. సినిమా అవుట్ డోర్ షూటింగ్‌లు విజయవాడ, వైజాగ్ నగరాల్లో జరిగేలా ప్రభుత్వం సౌకర్యాలు కల్పించాలన్నారు. సమావేశంలో వైసీపీ నాయకులు మహేశ్వరరెడ్డి, సూర్యరెడ్డి, సత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'లక్‌పతి దీదీ'ల ఎంపిక

కర్నూలు(అగ్రికల్చర్): నిరుపేద మహిళలను లక్షాధికారులుగా చేసేందుకు కేంద్రప్రభుత్వం జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్(ఎన్‌ఆర్‌ఎల్‌ఎం) కింద లక్‌పతి దీదీ పథకానికి శ్రీకారం చుట్టింది. ఏడాదికి రూ.లక్ష ఆపైన ఆదాయం పొందే విధంగా మహిళలకు అన్ని విధాల తోడ్పాటు ఇవ్వాలనేది ఈ పథకం ఉద్దేశం. 2024–25లో ఈ పథకం కింద జిల్లాలో 7,7121 మంది మహిళలను లక్‌పతి దీదీలుగా మార్చే విధంగా లక్ష్యాన్ని ఇచ్చిందని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ సలీమ్‌బాషా తెలిపారు. ఇందుకు అనుగుణంగా మహిళలను గుర్తించే ప్రక్రియ కూడ చేపట్టినట్లు ఆయన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు 4 వేల మందిని గుర్తించినట్లు ఆయన పేర్కొన్నారు. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు వివిధ జీవనోపాధులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. జీవనోపాధులను కల్పించుకునేందుకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తున్నామని, ఉన్నతి, స్త్రీనిధి కింద రుణ సదుపాయం కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

ముగిసిన బాలాలయ మహాసంప్రోక్షణ



ప్రత్యేకలంకరణలో ఉత్సవమూర్తులు





ఆలయ గోపుర శిఖరంపై కలశాలను ప్రతిష్టిస్తున్న అర్చకులు, ఉత్సవ మూర్తులను ఊరేగిస్తున్న వేద పండితులు

ఆళ్లగడ్డ: దిగువ అహోబిల క్షేత్రంలో 12 ఏళ్లకోసారి ఆగమోక్తంగా నిర్వహించే అష్టబంధన బాలాలయ జీర్ణోద్ధరణ మహా సంప్రోక్షణ కార్యక్రమం ఆదివారం శాస్త్రోక్తంగా ముగిసింది. తెల్లవారుజామునే స్వామి, అమ్మవార్లను సుప్రభాత సేవతో మేలుకొలిపి నిత్య పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వాములను పట్టుపీతాంబరాలతో అలంకరించి ఉత్సవ పల్లకీలో ఊరేగింపుగా యాగశాలకు తోడ్కొని వచ్చారు. అనంతరం గోపూజ, గజపూజ, అశ్వపూజ, త్రయోదశ దర్శనం, విశ్వరూపం, చతుస్థానార్చనం అనంతరం శాంతిహోమం నిర్వహించి మహాపూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం యాత్రాదానం, గ్రహప్రీతి, మహాకుంభ యాత్ర నిర్వహించారు. ఆలయ గోపుర శిఖరంపై కలశాలను ప్రతిష్ఠించారు. రాత్రి శ్రీ జ్వాలా నరసింహస్వామి గరుడ వాహనం అధిష్టించి మాఢ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. అహోబిలం మఠం పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్, ప్రధానార్చకులు కిడాంబి వేణుగోపాలన్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

'సాక్షి'పై టీడీపీ నాయకుల అక్కసు

కొలిమిగుండ్ల: టీడీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఆపార్టీ నేతలు చేస్తున్న అరాచకాలకు అడ్డూ అదుపులేకుండా పోతుంది. గ్రామాల్లో దాడులు, బెదిరింపులకు పాల్పడుతున్నారు. తాజాగా పత్రికా స్వేచ్ఛపై అధికార పార్టీ నేతలు ఆంక్షలు విధిస్తున్నారు. నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలంలోని అంకిరెడ్డిపల్లెలో 'సాక్షి' దినపత్రికపై టీడీపీ నాయకులు అక్కసు వెళ్లగక్కారు. సాక్షి పత్రిక ప్రారంభం నుంచి ఆఊరికి పత్రిక ప్రతి రోజు వెళుతుంది. రోజు మాదిరిగానే కర్నూలు నుంచి ట్రాన్స్‌పోర్టు వెహికల్‌లో ఆదివారం తీసుకెళ్లి పార్శిల్‌ను ఏజెంట్‌కు అందజేశారు. వెహికల్ డ్రైవర్ బాషా అక్కడి నుంచి తిరుగు పయనం అవ్వగా ప్రధాన రహదారి వద్ద ఇద్దరు టీడీపీ కార్యకర్తలు జీపును ఆపి రేపటి నుంచి మా ఊరికి సాక్షి పేపర్ తీసుకురావొద్దు. ఇక్కడ తప్ప ఏ ఊర్లోనైనా వేసుకో..నారాయణరెడ్డి అన్న చెప్పాడని హుకుం జారీ చేశారు. రేపటి నుంచి వస్తే బాగుండదని హెచ్చరించారు. ఈ విషయం ఇంటెలిజెన్స్, ఎస్‌బీ అధికారుల దృష్టికి వెళ్లడంతో వివరాలు ఆరాతీశారు.

బ్రాహ్మణులను కించపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలి



బ్రాహ్మణ సంఘాల నాయకులు

కర్నూలు కల్చరల్: బ్రాహ్మణులను కించపరిచిన దాస్ పాలేను వెంటనే అరెస్ట్ చేయాలని వివిధ బ్రాహ్మణ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం నంద్యాల చెక్ పోస్ట్ సమీపంలోని దేవీ ఫంక్షన్ హాల్‌లో బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్ర మండలి అధ్యక్షులు నండేల్ చంద్రశేఖర్ అధ్యక్షతన వివిధ బ్రాహ్మణ సంఘాల సమావేశం జరిగింది. బ్రాహ్మణులను విమర్శిస్తూ స్మార్తులు బ్రాహ్మణులే కాదని వారు అధములు, నీచులు అని దుర్భాషలాడిన దాస్ పాలేపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బ్రాహ్మణుల ఐక్యతను చెడగొట్టే ప్రయత్నం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో వివిధ సంఘాల నేతలు కోలుకుల చంద్రశేఖర్ , దేవెళ్ల వసంత సాయినాథ శర్మ, టీవీ రవిచంద్ర, సముద్రాల శ్రీధర్, కంచుగంటల శ్యామ సుందర్ రావు, మామిళ్ల పల్లి రాజేష్, రెంటచింతల సుధాకర శర్మ, శంకర్ దత్త, సునీల్ శర్మ, శివ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.